మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

## శాటిలైట్, లోకల్ ఛానల్ ద్వారా వచ్చే వార్త ప్రసారాలను పూర్తి స్థాయిలో రికార్డు చేయాలి...

**- ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా మీడియాకు సమగ్ర సమాచారాన్ని అందించాలి**

**- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబర్ 16 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ సమీకృత కలెక్టరేట్‌లోని జీ1 హాల్‌లో మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ (ఎంసీఎంసీ)ను కలెక్టర్ ఉదయ్‌కుమార్ ఆకస్మికంగా సందర్శించారు. ఎంసీఎంసీ పనితీరుకు సంబంధించిన అంశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఎంసీఎంసీ సెల్ విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈసెల్ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, ప్రచురణ, ముందస్తు అనుమతులు లేకుండా ప్రకటనలను ప్రసారం చేయడం, సంబంధిత అభ్యర్థి ప్రచార వ్యయంలో వాటిని లెక్కించడం, సోషల్ మీడియాలో అభ్యర్థులు రాజకీయ పార్టీల ప్రకటనలకు వంటివి సకాలంలో ఆమోదిస్తూ మంజూరు చేస్తున్నారా లేదా అనే విషయాన్ని ఎపీఆర్ఓతో అడిగి తెలుసుకున్నారు. శాటిలైట్, లోకల్ చానెల్స్‌లో వచ్చే వార్తలను పూర్తి స్థాయిలో రికార్డు చేయాలన్నారు. అందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వార్త పత్రికలు, ఈ పేపర్‌లు, టీవీ చానెల్స్, స్థానిక కేబుల్ నెట్‌వర్క్, సోషల్ మీడియా, మూవీ హౌస్‌లు మరియు సంక్షిప్త సందేశాలు, ఇతర ఆడియో, వీడియో విజువల్ మీడియాలతో సహా ప్రకటనలను ఎంసీఎంసీ నుంచి ముందస్తు అనుమతులు పొందిన తర్వాత మాత్రమే విడుదలయ్యేలా చూడాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి అతిక్రమించిన పోస్టులపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడానికి మీడియా పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు పౌర సంబంధాల అధికారి తిరుపతయ్య, ఎంసీఎంసీ సభ్యులు శ్రీధర్, దినకరరావు, భాస్కర్, లక్ష్మణ్, వెంకటయ్య, పాషా, శ్రీకర్, గురుబ్రహ్మేశ్వర, శ్రీను తరుణ్ తదితరులు ఉన్నారు.




మీడియా సెంటర్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

## ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి..

**జిల్లా సాధారణ పరిశీలకులు సంజయ్‌కుమార్ మిశ్రా.. నోడల్ రిటర్నింగ్ అధికారులతో సమీక్ష..**

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 16 ప్రభాతవార్త:** ఈ నెల 30వ తేదీన నిర్వహించనున్న రాష్ట్ర శాసనసభ ఎన్నికల పోలింగ్‌కు నోడల్ అధికారులు సంసిద్ధంగా ఉండాలని శాసనసభ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు సంజయ్‌కుమార్ మిశ్ర సూచించారు. గురువారం ఆయన జిల్లాకు కేటాయించబడిన వ్యయ పరిశీలకులు డా. కుందన్‌యాదవ్, జివి తేజస్వి, పోలీస్ పరిశీలకురాలు ఇలక్కియా కరుణాగరన్లతో కలిసి సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులతో ఎన్నికలపై సమావేశం నిర్వహించారు. పోలింగ్ సిబ్బందికి శిక్షణలో భాగంగా పిఓ, ఎపిఓ, ఓపిఓలు అందరికి కలిపి శిక్షణ కార్యక్రమ నిర్వహణ, ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, ఈవీఎంలు, పోలింగ్ రోజున తీసుకోవాల్సిన చర్యలు, ఓటరు అవగాహన, పోలీసు సిబ్బందికి శిక్షణ తదితర అంశాలపై సూచనలు చేశారు. మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు డా. కుందన్ యాదవ్ మాట్లాడుతూ ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి బృందాలు 24 గంటలు పని చేయాలని, ఎవరికీ కేటాయించిన విధులు వారు పక్కాగా నిర్వహించాలని, కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలను తుచ తప్పకుండా పాటించాలని చెప్పారు. జడ్చర్ల, దేవరకద్ర అసెంబ్లీ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు జెవి తేజస్వి మాట్లాడుతూ ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి బృందాలలో అవసరమైతే మరో పోలీసును అదనంగా చేర్చాలని సూచించారు. జిల్లా కలెక్టర్ జి. రవినాయక్ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇప్పటివరకు చేపట్టిన చర్యలపై వివరించారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ పోలీస్ బందోబస్తు ప్రణాళిక, బందోబస్తు అంశాలను వివరించారు. మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు అనిల్‌కుమార్, ఎస్. మోహన్‌రావు, నటరాజ్, నోడల్ అధికారులు తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.




మాట్లాడుతున్న సంజయ్ కుమార్ మిశ్ర

## లింగాల మండలంలో పోలీసు కవాతు..

**లింగాల, నవంబరు 16 ప్రభాతవార్త :** ఈనెల 30వ తేదీన జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గురువారం లింగాల మండల కేంద్రంలోని పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు బంజారావీధి నుంచి ప్రధాన వీధుల గుండా పోలీస్ స్టేషన్ వరకు కవాతు నిర్వహించారు. ప్రజలు తమ ఓటును ఎలాంటి భయాందోళనలకు గురి కాకుండా వినియోగించుకోవాలన్నారు. శాంతి భద్రతల నిర్వహణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని పోలీసు అధికారులు కోరారు. గ్రామాల్లో అల్లర్లు సృష్టించిన, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ఓటును వినియోగించుకోవాలని పోలీసులు కోరారు.



లింగాలలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

## రేపు పాలమూరుకు బండి సంజయ్ రాక..

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 16 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి కరీంనగర్ ఎంపి బండి సంజయ్‌కుమార్ శుక్రవారం వస్తున్నట్లు బిజెపి జిల్లా అధ్యక్షులు వీరబ్రహ్మాచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్లో ఎంవిఎస్ డిగ్రీ కళాశాల మైదానంలో ఉదయం 11 గం.లకు బయలుదేరి, అక్కడి నుంచి రోడ్డు మార్గాన బొక్కలోనిపల్లి చౌరస్తా జెపిఎన్‌సి కాలేజీ వద్ద మీటింగ్‌లో పాల్గొంటారు. మధ్యాహ్నం 1.30 గం.లకు బొక్కలోనిపల్లి చౌరస్తా నుంచి రోడ్డు మార్గాన పాలమూరు పట్టణంలోని వన్‌టౌన్ చౌరస్తా వరకు చేరుకుంటారు. వన్‌టౌన్ చౌరస్తా నుంచి పాతలైబ్రరీ ఏరియా, రాంమందిర్ చౌరస్తా, పాన్‌చౌరస్తా మీదుగా గడియారం చౌరస్తాకు చేరుకుంటారు. గడియారం చౌరస్తాలో ఏర్పాటుచేసిన కార్నర్ మీటింగ్‌లో వారు పాల్గొని ప్రజలనుద్దేశించి మాట్లాడనున్నారు. బండి సంజయ్‌కుమార్ వస్తున్న సందర్భంగా పాలమూరు నియోజకవర్గంలోని బిజెపి అభిమానులు, కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా బిజెపి జిల్లా అధ్యక్షులు కోరారు.

# ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి..

**స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించాలి**

**సాధారణ ఎన్నికల పరిశీలకుడు సంజయ్‌కుమార్ మిశ్రా**

**వివిధ రాజకీయ పార్టీలతో సమావేశం**

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 16 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లాలో రాష్ట్ర శాసనసభ ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రాజకీయ పక్షాలు సహకారం అందించాలని కేంద్ర ఎన్నికల సంఘం ద్వారా జిల్లాకు సాధారణ పరిశీలకులుగా నియమించబడిన సంజయ్‌కుమార్‌మిశ్రా అన్నారు. గురువారం ఆయన సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ జి.రవినాయక్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ముందుగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జి. రవినాయక్ మాట్లాడుతూ నవంబర్ 30వ తేదీన జిల్లాలో మూడు నియోజకవర్గాలలో నిర్వహించనున్న శాసనసభ ఎన్నికల పోలింగ్‌కు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని, పోలింగ్ కేంద్రాలు, ఓటరు పోలీసు బందోబస్తు, పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటర్లు ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ, దివ్యాంగ ఓటర్లు, 80 సంవత్సరాల పైబడిన ఓటర్లకు ఎన్నికల సంఘం కల్పించిన సౌకర్యాలు, ఎన్నికలు సక్రమంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన వివిధ బృందాలు, కంట్రోల్ రూమ్, సి విజిల్ తదితర అంశాలపై వివరించారు. అనంతరం సాధారణ ఎన్నికల పరిశీలకులు సంజయ్‌కుమార్ మిశ్రా మాట్లాడుతూ ఎన్నిలలో రాజకీయ పార్టీలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే తమదృష్టికి తీసుకురావాలని కోరారు. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించేందుకు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో కంట్రోల్ రూమ్‌లతో పాటు, జిల్లా కలెక్టర్, పోలీస్ కార్యాలయాలలో, అదేవిధంగా తనకు కూడా ఎవరైనా ఏదైనా సమస్యను తమ దృష్టికి తీసుకురావొచ్చని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి రాజకీయ పార్టీలతో పాటు, అధికారులు అందరికి తెలుసునని అందువల్ల ఎన్నికలను స్వేచ్ఛగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు అందరు సహకరించాల్సిందిగా ఆయన కోరారు. అడిషనల్ ఎస్పీ రాములు, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంజయ్‌కుమార్ మిశ్రా

## ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని పార్టీలు సహకరించాలి

**జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులు బిపి చౌహాన్**

**నారాయణపేట ప్రతినిధి, నవంబరు 16 ప్రభాతవార్త :** ఆర్డీఓ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం పోలీసు పరిశీలకులు బిఎస్ ధృవ వ్యయ పరిశీలకులు అభిషేక్ దేవల్‌తో కలిసి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎస్పీ యోగేష్ గౌతమ్ రాజకీయ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులు, ప్రతినిధులతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాధారణంగా ఎన్నికల పరిశీలకులు మాట్లాడుతూ ఇప్పటివరకు తెలిపిన అంశాలను పూర్తిగా అభ్యర్థులు పాటిస్తూ ఎన్నికలలో ఎలాంటి గొడవలకు గాని శాంతి భద్రతలకు గాని భంగం కలగకుండా అభ్యర్థులు సహకరించాలన్నారు. ఎన్నికల ఉల్లంఘనలు జరిగినట్లు భావిస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎన్నికల ఓటరు స్లిప్పులు పంపిణీ చేయుటకు సహకరించాలన్నారు. ఎలాంటి అనుమతి కావాలన్నా ముందస్తుగా తీసుకోవాలన్నారు. మాక్‌పోల్ ఏ విధంగా నిర్వహించబడుతుందో కమిషనింగ్ ద్వారా తెలుపుతుందని అన్నారు. పోలీస్ పరిశీలకులు మాట్లాడుతూ పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల సమయ నిబంధనలు పాటిస్తూ సహకరించాలన్నారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ఖర్చు పరిశీలకులు మాట్లాడుతూ అభ్యర్థి చేతి పుస్తకంలో పొందుపరిచిన ఖర్చులు, వివరాలు ఏవిధమైన ఖర్చులు, ఏ విధంగా నివేదించాలి అని పొందుపరచడమైందని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ప్రతి రాజకీయ పార్టీ బూతులు ఏజెంట్లను నియమించుకోవాలని తెలిపారు. ఇంటింటికి స్లిప్పుల పంపిణీలో సహకరించాలన్నారు. మద్యం నగదు పంపిణీపై సమాచారం అందితే కంట్రోల్ రూమ్ సి విజిల్ ద్వారా తెలుపవచ్చున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచార వాహనాలకు, గ్రామాలలో డోర్ టు డోర్ ప్రచారం చేసేవారు ముందస్తు పోలీసు వారికి సమాచారం ఇవ్వాలని వారికి తగిన బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని ప్రచార సమయంలో ఎలాంటి గొడవలు జరగకుండా ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఇతర రాష్ట్రాల నుండి పోలీస్ ఫోర్స్, కేంద్ర సాయుధ బలగాల కంపెనీలు వస్తున్నాయని పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఎలాంటి కంప్లైంట్ చేయాలంటే పోలీస్ అబ్జర్వర్‌కి కంప్లైంట్ చేయొచ్చని లేదా సి విజిల్, 1950 టోల్ ఫ్రీ నంబర్లకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. సహాయ ఖర్చు పరిశీలకులు మాట్లాడుతూ ఎన్నికల కొరకు ప్రత్యేక అకౌంట్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి ఖర్చులు ఇదే ఖాతా నుండి లావాదేవీలు జరపాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, ఆర్‌డిఓ రాంచందర్, అధికారులు, రాజకీయ పార్టీ అభ్యర్థులు, ప్రతినిధులు మహబూబ్ అలీ, బిజెపి మనోహర్ ప్రసాద్‌గౌడ్, కాంగ్రెస్ విశ్వజిత్, గండం వినోద్, కె. రాజవర్ధన్‌రెడ్డి బిఆర్ఎస్, చిట్టె పర్ణికారెడ్డి కాంగ్రెస్, ఇర్షాద్ డీఎస్పీ, రాజేందర్‌రెడ్డి స్వతంత్ర అభ్యర్థి, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



అధికారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

**ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు**

## ముందస్తు చర్యలు చేపట్టాలి...





వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబర్ 16 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లాలోని 3 నియోజకవర్గాల్లో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ముందస్తు చర్యలు తీసుకోవడం జరిగిందని నాగర్‌కర్నూల్ సాధారణ ఎన్నికల పరిశీలకులు మితేష్ మిశ్రా అన్నారు. గురువారం కేంద్ర ఎన్నికల కమిషన్ నుంచి సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేష్ వ్యాస్ తెలంగాణ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో నియమితులైన అబ్జర్వర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వివరాలు సేకరించారు. డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితీష్ వ్యాస్ మాట్లాడుతూ గత అనుభవాల దృష్ట్యా తెలంగాణలో ఎన్నికలు సున్నితంగా ఉంటాయని, అందువల్ల కేంద్రం నుంచి పంపిన ఎన్నికల పరిశీలకులు అందరు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సర్వైకల్ స్టాటస్టికల్, ఫ్లయింగ్ సా క్వడ్ బృందాలు 24 గంటలు పనిచేసే విధంగా చూడాలని ఆదేశించారు. డబ్బులు, మద్యం, వస్తువుల రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఎన్నికలు ప్రశాంతంగా పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. సివిజిల్ యాప్ మీద ఎక్కువ ప్రచారం జరిగే విధంగా చూడాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న సాధారణ ఎన్నికల పరిశీలకులు మితేష్‌మిశ్రా మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలో ఎలాంటి ఇబ్బందులు లేవని, ఎన్నికల నిబంధనల మేరకు ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడం నిర్వహిస్తామని తెలిపారు. నాగర్‌కర్నూల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యయ పరిశీలకులు బేరారామ్ చౌదరి ఐఆర్ఎస్, కొల్లాపూర్, అచ్చంపేట సాధారణఎన్నికల పరిశీలకులు సతీష్‌కుమార్ ఐఎఎస్, జిల్లా పోలీస్ అబ్జర్వర్ డాక్టర్ ఇలియాస్ కేపిఎ ఐపీఎస్ పాల్గొన్నారు.

## జిల్లాలో ఓటింగ్ శాతం పెంచే దిశగా ఓటర్ సెల్ఫీ పాయింట్స్ ఏర్పాటు..

**- ప్రజాస్వామ్యంలో ఓటు చాలా కీలకం.. - జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబర్ 16 ప్రభాతవార్త:** జిల్లాలో ఓటింగ్ శాతం పెంచే దిశగా స్వీప్ కార్యక్రమంలో భాగంగా సెల్ఫీ పాయింట్స్‌ను జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గురువారం నాగర్‌కర్నూల్ ఐడీఓసీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సెల్ఫీ పోస్టర్ ద్వారా అవగాహన కార్యక్రమాన్ని కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ ఓటర్ స్వీయ చిత్రీకరణతో జిల్లా ఓటర్లకు కల్పించారు. 3 నియోజకవర్గాల పరిధిలో ప్రజలు రద్దీగా ఉండే ప్రాంతాల్లో సెల్ఫీ పాయింట్స్ ఏర్పాటు చేసి ఓటు అవశ్యకతపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కలిగే విధంగా ఏర్పాటు ఐవీఓట్ బీకాస్ ఐ లవ్ నాగర్‌కర్నూల్ అని ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు చాలా కీలకమని, అర్హత ఉన్న ప్రతి ఒక్క ఓటరు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే జిల్లాలోని నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో ఓటు అవశ్యకతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. సమీకృత కార్యాలయంలోని అన్ని శాఖల అధికారులు ఓటర్ స్వీయ చిత్రీకరణ ద్వారా సెల్ఫీ ఫోటోలు దిగారు. అనంతరం సమీకృత కార్యాలయాల భవనంలో ఏర్పాటు చేసిన సి విజిల్ 1950 ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్‌ను కూడా కలెక్టర్ సందర్శించారు. సి విజిల్ ద్వారా అందుతున్న ఫిర్యాదుల తీరును ఆయన అక్కడ ఉన్న వారిని అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని వారికి సూచించారు. ప్రధానంగా ఎన్నికల్లో వివిధ విభాగాల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే సంబంధిత అధికారులకు చేరవేయాలని తెలిపారు. సి విజల్ ద్వారా ఇప్పటి వరకు 99 ఫిర్యాదులు అందగా 99 ఫిర్యాదులను ఆయా రిటర్నింగ్ అధికారుల ద్వారా పరిష్కరించడం జరిగిందని, ఇప్పటి వరకు ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు 4 సివిజిల్ ఫిర్యాదుల నిర్ధారణంగా సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేయడం జరిగిందని, 1950 ద్వారా ఇప్పటి వరకు వచ్చిన 1733 ఫిర్యాదులను పరిష్కరించడం జరిగిందని, కాల్ సెంటర్ నోడల్ అధికారి డాక్టర్ లక్ష్మప్ప కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ వెంట లక్ష్మప్ప, స్వీప్ నోడల్ అధికారి కృష్ణ, నోడల్ అధికారి కార్తీక్‌కుమార్, రామోహన్‌రావు, నర్సింగరావు, నరేష్, సిబ్బంది ఆరీఫ్, రేణుక, పార్వతమ్మ, ఏపీఆర్ఓ తిరుపతయ్య తదితరులు ఉన్నారు.



సి విజిల్ కాల్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

## పార్టీ అభ్యర్థులు ఎన్నికల నిబంధనలకు లోబడి ప్రచారం చేసుకోవాలి

**జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులు బిపి చౌహాన్**






అధికారులతో, అభ్యర్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ (ఇన్‌సెట్లో) సమావేశానికి హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

**నారాయణపేట ప్రతినిధి, నవంబరు 16 ప్రభాతవార్త :** గురువారం మక్తల్ తహసిల్దార్ కార్యాలయ సమావేశ మందిరంలో పోలీసు పరిశీలకులు బిఎస్ ధృవ వ్యయ పరిశీలకులు అభిషేక్ దేవల్‌తో కలిసి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ రాజకీయ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులు, ప్రతినిధులతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాధారణంగా ఎన్నికల పరిశీలకులు మాట్లాడుతూ ఇప్పటివరకు తెలిపిన అంశాలను పూర్తిగా అభ్యర్థులు పాటిస్తూ ఎన్నికలలో ఎలాంటి గొడవలకు గాని శాంతి భద్రతలకు గాని భంగం కలగకుండా అభ్యర్థులు సహకరించాలన్నారు. ఎన్నికల ఉల్లంఘనలు జరిగినట్లు భావిస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎన్నికల ఓటరు స్లిప్పులు పంపిణీ చేయుటకు సహకరించాలన్నారు. ఎలాంటి అనుమతి కావాలన్నా ముందస్తుగా తీసుకోవాలన్నారు. మాక్‌పోల్ ఏ విధంగా నిర్వహించబడుతుందో కమిషనింగ్ ద్వారా తెలుపుతుందని అన్నారు. పోలీస్ పరిశీలకులు మాట్లాడుతూ పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల సమయ నిబంధనలు పాటిస్తూ సహకరించాలన్నారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ఖర్చు పరిశీలకులు మాట్లాడుతూ అభ్యర్థి చేతి పుస్తకంలో పొందుపరిచిన ఖర్చులు, వివరాలు ఏవిధమైన ఖర్చులు, ఏ విధంగా నివేదించాలి అని పొందుపరచడమైందని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ప్రతి రాజకీయ పార్టీ బూతులు ఏజెంట్లను నియమించుకోవాలని తెలిపారు. ఇంటింటికి స్లిప్పుల పంపిణీలో సహకరించాలన్నారు. మద్యం నగదు పంపిణీపై సమాచారం అందితే కంట్రోల్ రూమ్ సి విజిల్ ద్వారా తెలుపవచ్చున్నారు. ఈసందర్భంగా ఎస్పీ యోగేష్‌గౌతమ్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారవాహనాలకు, గ్రామాలలో డోర్ టు డోర్ – మిగతా 2లో..

## వరి ధాన్యం సేకరణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నాణ్యత..

**ప్రమాణాలను పాటిస్తూ ధాన్యం సేకరించాలి:జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి**

**గద్వాల ప్రతినిధి నవంబర్ 16 ప్రభాతవార్త:** వానాకాలం వరి ధాన్యం సేకరణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ ధాన్యం సేకరించాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. గురువారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని సమావేశం హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ తరుగు పేరుతో రైతులకు ఇబ్బందులకు గురిచేస్తే అధికారులపై కఠిన చర్యలు తప్పవని, తేమశాతం, నాణ్యతా ప్రమాణ పరీక్షలు, ధాన్యం సేకరించిన అనంతరం రైతుల ఖాతాలలో సకాలంలో డబ్బులు చెల్లించాలని ఆదేశించారు. ధాన్యం సేకరణలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తేమ పరిశీలన యంత్రాలను ప్యాడీ క్లీనర్స్ సిద్దం చేసుకుని, రైతులకు సరిపడగన్నీ బ్యాగులను అందించాలని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో వ్యవసాయ అధికారులు పీసీసీ సెంటర్ ఇంచార్జ్‌లు సక్రమంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఏఈఓలు రైతు పండించిన పంటను కొనుగోలు సమయంలో రైతులకు ఇచ్చే టోకెన్‌ల ఆధారంగా ధాన్యం సేకరణ చేయాలని అన్నారు. రైతు దగ్గర నుండి ధాన్యం సేకరించిన వెంటనే మద్దతు ధర చెల్లించాలని అన్నారు. డీఆర్‌డీఓ, ఐకేపీ, మెప్మా అధికారులు ఎప్పటికప్పుడు ఎటువంటి ఇబ్బందులు రాకుండా కేంద్రాలను విజిట్ చేసి ఎవరికి ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతుల దగ్గర నుంచి ప్రభుత్వమే వరి ధాన్యానికి కనీస మద్దతు ధర క్వింటాల్‌కు గ్రేడ్ ఏ రకానికి రూ.2203, సాధారణ రకానికి రూ.2183 చెల్లిస్తోందని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం ధాన్యంలో తేమ 17 శాతం కంటే తక్కువ ఉండేటట్టు చూసుకోవాలని తెలిపారు. చెత్త, తాలు, మట్టిపెడ్డలు, రాళ్లు ఎక్కువ రాకుండా పరీక్షించి, ధాన్యం కొనుగోలు చేయాలని తెలిపారు. ధాన్యం సేకరణలో తరుగు ఉందని చెప్పకుండా నిబంధనల ప్రకారం పరీక్షలు నిర్వహించాలని, విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు. ధాన్యం నిలువ ఉన్న కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు ధాన్యం మిల్లులకు తరలించడానికి తగినంత వాహనాలను, హమాలీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితులలో కల్లం నుండి నేరుగా ధాన్యాన్ని మిల్లులకు తరలించరాదని, ధాన్యాన్ని వేసిన తరువాత రైతులు విధిగా రశీదులు పొందాలని అన్నారు. రైతులు ధాన్యం అమ్ముకోవడంలో ఏదైనా సమస్యలు ఎదురైతే సంబంధిత పౌరసరఫరాల అధికారులను, ఆర్డీవో, తహసిల్దార్‌లను లేదా సంబంధిత వ్యవసాయాధికారులను సంప్రదించవచ్చని అన్నారు. ఇతర రాష్ట్రల నుంచి జిల్లా కేంద్రాలకు ధాన్యం రాకుండా చెక్ పోస్టులలో నిఘా ఉంచాలని ఆదేశించారు. అనంతరం ఏఈఓలకు, ఐకేపీ, మెప్మా సహకార పరపతి కేంద్రాల నిర్వాహకులకు పీపీటీ ద్వారా శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 2023 24 వానాకాలం (ఖరీఫ్) ప్యాడీ ప్రోక్యూర్ మెంట్ అవగాహన శిక్షణా శిబిరానికి సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాసులు, రెవెన్యూ డిఆర్‌డిఓ జిల్లా ఇంచార్జి అధికారి కాంతమ్మ, జిల్లా సివిల్ సప్లై అధికారి రేవతి, జిల్లా మార్కెటింగ్ అధికారి పుష్ప, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవిందు నాయక్, కోఆపరేటివ్ అధికారి ప్రసాద్ రావు, ఏఈఓలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్



సమావేశంలో పాల్గొన్న అధికారులు

## ఓటింగ్‌లో పాల్గొని ప్రజాస్వామ్య స్ఫూర్తిని నిలుపుదాం!



ఎద్దదిన్నెలో ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపిడిఓ రాఘవ

**ఇటిక్యాల, నవంబరు 16 ప్రభాతవార్త:** ఈనెల 30 తేదీన జరిగే సాధారణ ఎన్నికల్లో ఓటరు ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకొని నైతిక ఓటరుగా ఉండి ప్రజాస్వామ్య స్ఫూర్తిని నిలపాలని ఎంపిడిఓ రాఘవ ప్రజలకు ఓటుపై అవగాహన కల్పించారు. గురువారం మండల పరిధిలోని పెద్దదిన్నె గ్రామంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి అందులో అన్ని సౌకర్యాలు ఉండేలా ఓటింగ్‌లో పాల్గొనే ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని గ్రామ కార్యదర్శిని ఎంపిడిఓ రాఘవ ఆదేశించారు. ఈ సందర్భంగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామ ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివన్న, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మలిదశ ఉద్యమకారుడు, జెడ్పీ వైస్ ఛైర్మన్‌కు అరుదైన గౌరవం

### -స్పోక్ పర్సన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు



బాలాజీసింగ్‌కు ఉత్తర్వులు కాపీ అందిస్తున్న వంశీచంద్‌రెడ్డి

**కల్వకుర్తి, నవంబర్ 16 ప్రభాతవార్త:** మలిదశ ఉద్యమకారులు, నాగంకర్నూల్ జెడ్పీ వైస్ ఛైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్‌కు కాంగ్రెస్ పార్టీలో అరుదైన గౌరవం దక్కింది. కాంగ్రెస్ పార్టీ తరుపు నుంచి స్పోక్ పర్సన్‌గా ఠాకూర్ బాలాజీసింగ్‌ను నియమిస్తూ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేష్‌కుమార్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ జారీ చేసిన ఉత్తర్వుల కాపీని బాలాజీసింగ్‌కు అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పీ వైస్ ఛైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్ మాట్లాడుతూ నా నియామకానికి సహకరించిన మల్లిఖార్జున్ ఖర్గే, రేవంత్‌రెడ్డి, చల్లా వంశీచంద్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుడి కుటుంబానికి నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

**వెల్దండ, నవంబర్ 16 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొట్ర గ్రామానికి చెందిన నారామళ్ల బాలరాజు ఇటీవల మృతి చెందారు. మృతుడి కుటుంబాన్ని కొట్ర గ్రామ సేవా సమితి అధ్యక్షులు పొనుగోటి రవీందర్‌రావు పరామర్శించి రూ.5వేల విలువ చేసే నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. మృతుడి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కడారి శ్రీనివాస్‌యాదవ్, నాయకులు పెంటయ్య, రవీందర్, ఫిరంగి, మల్లేష్, రాజు, నిరంజన్, వెంకటయ్య, నర్సింహ్మతో పాటు తదితరులు ఉన్నారు.

## ఘనంగా జాతీయ పత్రికా దినోత్సవం



**నారాయణపేట ప్రతినిధి, నవంబరు 16 ప్రభాతవార్త:** మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో జాతీయ పత్రికా దినోత్సవ వేడుకలు విలేఖరుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పత్రికా విలేఖరులందరు కలిసి కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో జర్నలిస్టుల పాత్ర ఎనలేనిదని ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని పలువురు కొని యాడారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు అంజన్ ప్రసాద్, దేవసూ గూరు సురెందర్, రిపోర్టర్‌లు మామిళ్ల పృథ్వీరాజ్, నవీన్‌కుమార్, శంకర్ కుమార్, లక్ష్మారెడ్డి, అంబదాసు, ప్రదీప్, గోవింద్, కార్తీక్ పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ గుడికి భూమిపూజ



**ఉప్పునుంతల, నవంబరు 16 ప్రభాతవార్త:** మండలంలోని సూర్యతండాలో గిరిజనుల ఆరాద దైవమైన ముత్యాలమ్మ గుడి భూమిపూజను గిరిజన సోదరులు నిర్వహించారు. ఈ భూమిపూజకు అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, తిప్పర్తి నరసింహారెడ్డి, వెల్టూరు ఎంపిటిసి రెడ్డి రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎంపిటిసి రాంసింగ్, గుద్దటి బాలరాజ్, సూరం ప్రశాంత్‌రెడ్డి (బిట్టు), యూత్ కాంగ్రెస్ ఇంఛార్జి శేఖర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ బిసి సెల్ అధ్యక్షుడు మడ్డి తిరుపతయ్య గౌడ్, కట్టశ్రీనివాస్‌రెడ్డి, గిరిజన సోదరులు, గిరిజన మహిళలు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి ఉపన్యాస పోటీలకు ఎంపికైన అప్పరాల విద్యార్థిని



**కొత్తకోట, నవంబర్16, ప్రభాతవార్త:** మండలం అప్పరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని కృష్ణవేణి ఉపన్యాస పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ఉపాధ్యాయుడు గోపాల్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలో మానవ మనుగడలో ప్రకృతి పాత్ర అనే అంశం పై జిల్లా స్థాయి ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో చక్కటి ఉపన్యాసం అందించి అందరిని ఆకట్టుకుంది. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం పొందిన విద్యార్థికి 3 వేలు నగదు, మెమోంటో అందుకున్నారు. అలాగే ఈ నెల 18 న హైదరాబాద్ లో జరిగే రాష్ట్ర స్థాయి ఉపన్యాస పోటీల్లో పాల్గొంటుందని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ నాయకులు విద్యార్థిని అభినందించారు.

## ఘనంగా జాతీయ ప్రకృతి వైద్య దినోత్సవం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబర్ 16 ప్రభాతవార్త:** గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ మరియు గాంధీ జ్ఞాన ప్రతిష్టాన్ తెలంగాణ సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయుల వేధిక ఆధ్వర్యంలో జాతీయ ప్రకృతి వైద్య దినోత్సవం సందర్భంగా మానవుడి జీవన విధానంలో ప్రకృతి పాత్ర అనే అంశంపై మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు జిల్లా స్థాయిలో నేడు నేషనల్ హైస్కూల్ నాగర్‌కర్నూల్ నందు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ గోవిందరాజు మాట్లాడుతూ ప్రకృతిలో మానవుడు ఒక భాగమని, ప్రకృతిని కాపాడుతూ పోతే మానవుని జీవితం అంత సుఖంగా ఉంటుందని, ప్రకృతి నాశనం చేస్తే మానవుడి జీవితం దుర్భరమవుతుందని, ప్రపంచంలోని సకల జీవరాశులు సుఖ సంతోషాలతో ఉండాలంటే ప్రకృతిని కాపాడుకోవడం ఎంతో అవసరమని, అది విద్యార్థి జీవితం నుంచి అలవాటు పడాలన్నారు. తర్వాత జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రకృతిని మానవుడు ధ్వంసం చేయడం అలవాటుగా చేసుకున్నాడని, ప్రకృతిని కాపాడుకోవడమనేది అలవాటుగా మార్చుకోవాలని, ఒక్కరు చేస్తే సరిపోదని, ప్రకృతిని పరిరక్షించడం మనందరి బాధ్యత అని గుర్తించాలన్నారు. అనంతరం విద్యార్థినులకు ఈ అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను డీఎస్ఓ కృష్ణారెడ్డి, తెలంగాణ సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయుల వేధిక జిల్లా అధ్యక్షులు కృష్ణ మోహన్ అందించారు. కార్యక్రమానికి న్యాయ నిర్ణేయితలుగా వహీద్‌ఖాన్, ఉపాధ్యాయులు మురళిలు వ్యవహరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి, సోషల్ ఫోరం సభ్యులు కృష్ణకుమార్, నిరంజన్, గోపి, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేస్తున్న దృశ్యం

## అద్భుతంగా బొటానికల్ గార్డెన్

### బొటానికల్ గార్డెన్‌ను సందర్శించిన ఫారెస్టు కళాశాల, పరిశోధనా సంస్థ విద్యార్థులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు16 ప్రభాతవార్త:** డా.బి.ఆర్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అభివృద్ధి చేస్తున్న తెలంగాణ బొటానికల్ గార్డెన్‌ను సిద్ధిపేట జిల్లా ములుగులోని అటవి కళాశాల, పరిశోధనా సంస్థకు చెందిన విద్యార్థులు 50 మంది, నలుగురు అధ్యాపకులు సందర్శించారు. వీరికి కళాశాల ప్రిన్సిపాల్ డా. అప్పియ చిన్నమ్మ, వృక్షశాస్త్ర విభాగాధిపతి శ్రీనివాసులు, గార్డెన్ సమన్వయకర్త డా.బి. సదాశివయ్య సాదరంగా ఆహ్వానించారు. ఆ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, అధ్యాపకులు గార్డెన్‌లోని వివిధ మొక్కలను పరిశీలించారు. వీరికి గార్డెన్ గురించిన వివరాలను గార్డెన్ కో ఆర్డినేటర్ డా.బి. సదాశివయ్య, వృక్షశాస్త్ర విభాగాధిపతి వివరించారు. తదుపరి విద్యార్థులకు గార్డెన్‌లోని ప్రతి భాగాన్ని, బయోడైవర్సిటీ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ సెంటర్, తెలంగాణ స్టేట్ హెర్బరియంను సమన్వయకర్త వివరించారు. రీసెర్చ్ లాబ్‌లో జరుగుతున్న పరిశోధనలు, అలాగే పాముల గురించి వివరించారు. విద్యార్థులు మాట్లాడుతూ మేము పుస్తకాలలో చదివిన అనేక మొక్కలను ఇక్కడ ప్రత్యక్షంగా చూడటం ఆనందంగా ఉందని తెలిపారు. అనేక అటమీ మొక్కలు, ఔషధ మొక్కలు ఇక్కడ ఉండటం గర్వకారణమని విద్యార్థులు సంతోషపడ్డారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. అప్పియ చిన్నమ్మ, అధ్యాపకులు శ్రీనివాసులు, సదాశివయ్య, లత, పరిశోధక విద్యార్థులురమాదేవి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్ సాయిరాం, నవనీత్, ఇందు, మేఘన కళాశాలల అధ్యాపకులు రేజా, ప్రియ, శివ పాల్గొన్నారు.



విద్యార్థులకు వివరిస్తున్న ప్రొ॥ సదాశివయ్య



బొటానికల్ గార్డెన్‌ను సందర్శించిన విద్యార్థులు బృందం

## వైభవంగా ముగిసిన బొడ్రాయి ఉత్సవాలు

- కన్నుల పండుగగా నాభి శిల బొడ్రాయి ఉత్సవాలు

**అమరచింత, నవంబర్16, ప్రభాతవార్త:** అమరచింత పట్టణంలో నాభి శీల బొడ్రాయి ప్రతిష్ఠ స్థాపన మహోత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా వేద పండితులు భువనాచందాచార్యులు, ప్రసాద్ శర్మ వేద పండితులచే మంత్ర తంత్రాల మధ్య పట్టణంలో నూతన బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమం మహంకాళి వీధి, శ్రీకృష్ణ నగర్, తహసిల్దార్ కార్యాలయం, శివాజీ నగర్, సుభాష్ నగర్, బీసీ కాలనీ, అమరచింత తాండ ఆయ వీధులలో విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. బొడ్రాయి ప్రతిష్ఠాపన సందర్భంగా భక్తులకు తహసిల్దార్ కార్యాలయం ఆవరణ, బీసీ కాలనీ, మహంకాళి విధి, సుభాష్ నగర్ లో భక్తులకు రాష్ట్ర మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయ్ ప్రకాష్ రెడ్డి, మహంకాళి శ్రీనివాసులు, గౌడ సంఘం, నెల్లికుండి సురేందర్ వేలాది మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆయావీధిలలో ఏర్పాటుచేసిన నూతన బొడ్రాయి విగ్రహాలకు ఆడపడుచులు నూతన వస్త్రాలు ధరించి బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న రాజకీయ నాయకులు, ప్రముఖులు. అమరచింత పట్టణంలో గత మూడు రోజులుగా జరుగుతున్న బొడ్రాయి నూతన ప్రతిష్ఠాపన కార్యక్రమం సందర్భంగా గురువారం మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే రాష్ట్ర మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయ్ ప్రకాష్ రెడ్డి, పీసీసీ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్పర్సన్ రజిని సాయిచంద్, మున్సిపల్ చైర్ పర్సన్ మంగమ్మ నాగభూషణం గౌడ్, అమరచింత పట్టణానికి చెందిన డి.ఎస్.పి, రవీందర్ రెడ్డి, చేనేత ప్రముఖ వ్యాపారవేత్త, మహంకాళి శ్రీనివాసులు, వీరితోపాటు బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవ కమిటీ నిర్వాహకులు తాటికొండ రమేష్, వెంకటేశ్వర్ రెడ్డి, కుమ్మరి, శ్రీను, విష్ణువర్దన్ రెడ్డి పాల్గొన్నారు.



బొడ్రాయి ప్రతిష్ఠాపనలో భక్తులు



బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



బొడ్రాయిని దర్శించుకుంటున్న ప్రముఖులు



భక్తులకు అన్నదాన కార్యక్రమం

## పార్టీ అభ్యర్థులు ఎన్నికల నిబంధనలకు లోబడి ప్రచారం చేసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రచారం చేసేవారు ముందస్తు పోలీసు వారికి సమాచారం ఇవ్వాలని వారికి తగిన బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని ప్రచార సమయంలో ఎలాంటి గొడవలు జరగకుండా ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఇతర రాష్ట్రాల నుండి పోలీస్ ఫోర్స్, కేంద్ర సాయుధ బలగాల కంపెనీలు వస్తున్నాయని పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఎలాంటి కంప్లైంట్ చేయాలంటే పోలీస్ అబ్జర్వర్‌కి కంప్లైంట్ చేయొచ్చని లేదా సి విజిల్, 1950 టోల్ ఫ్రీ నంబర్లకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఎన్నికల కొరకు ప్రత్యేక అకౌంట్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి ఖర్చులు ఇదే ఖాతా నుండి లావాదేవీలు జరపాలన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల అధికారి మయాంక్ మిత్తల్ మాట్లాడుతూ మక్తల్ నియోజకవర్గంలో 284 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ఈ నెల 16 నుండి 20 వరకు ఓటర్ స్లిప్పులు ఇంటింటికి పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈవిఎంల ర్యాండమైజేషన్ వివరాల తేదీ తెలియజేస్తామని అన్నారు. సి విజన్ యాప్ ద్వారా ఎలాంటి ఫిర్యాదులైన ఉంటే చేయచ్చని తెలిపారు. అధికారులు, రాజకీయ పార్టీ అభ్యర్థులు, ప్రతినిధులు వి. జగన్నాథరెడ్డి, బిఎస్పీ, జాలా నరెందర్, లక్ష్మణ్ స్వతంత్ర, వెంకట్‌రెడ్డి బిజెపి, దశరథ్‌కుమార్ డీఎస్పీ, సుచరిత బిఆర్ఎస్, రవికుమార్ కాంగ్రెస్, బాలకృష్ణ స్వతంత్ర, అనిల్ స్వతంత్ర, భరత్‌కుమార్, విష్ణు ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆకస్మిక తనిఖీలు చేపట్టిన జల్లా ఎస్పీ

**మగనూరు, నవంబరు 16 ప్రభాతవార్త:** జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు శాసనసభ ఎన్నికల బందోబస్తుకు వచ్చే పోలీసు అధికారులకు, సిబ్బంది, కేంద్ర సాయుధ బలగాలకు అకామిడేషన్, వసతి సౌకర్యాల ఏర్పాటు గురించి అదనపు ఎస్పీ నాగేంద్రుడు గురువారం మాగనూరు, కృష్ణ మండలంలోని రైతు వేదికలను, కున్ని గ్రామంలోని రైతు వేదికలను పరిశీలించి అక్కడ వారికి కావలసిన అవసరాలు ఏర్పాటు చేయడం జరుగుతందని అదనపు ఎస్పీ తెలిపారు.



అకస్మిక తనిఖీ చేస్తున్న ఎస్పీ



## పోలీసు కవాతు..

**లింగాల, నవంబరు 16 ప్రభాతవార్త :** ఈనెల 30వ తేదీన జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గురువారం లింగాల మండల కేంద్రంలోని పోలీ స్‌శాఖ ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహిం చారు. ఈ సందర్భంగా పోలీసులు బంజారావీధి నుంచి ప్రధాన వీధుల గుండా పోలీస్ స్టేషన్ వర కు కవాతు నిర్వహించారు. ప్రజలు తమ ఓటును ఎలాంటి భయాందోళనలకు గురి కాకుండా విని యోగించుకోవాలన్నారు. శాంతి భద్రతల నిర్వహ ణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని పోలీ సు అధికారులు కోరారు. గ్రామాల్లో అల్లర్లు సృష్టిం చిన, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చ రించారు. ప్రశాంత వాతావరణంలో ఓటును వినియోగించుకోవాలని పోలీసులు కోరారు.

## ఠాకూర్ బాలాజీసింగ్‌కు ఘన సన్మానం



**వెల్దండ, నవంబర్ 16 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధిగా నియమితులైన నాగర్‌కర్నూల్ జిల్లా జెడ్పీవైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్ నియమితులయ్యారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఠాకూర్ బాలాజీసింగ్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోతిలాల్‌నాయక్, సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, నాయకులు పర్వత్‌రెడ్డి, వరప్రసాద్‌రెడ్డి, సంజీవ్‌కుమార్‌యాదవ్, జంగయ్యయాదవ్, మట్ట వెంకటయ్యగౌడ్, రవీందర్‌రావు, సర్పంచ్ పత్యానాయక్, రామస్వామి, హామీద్, రషీద్, ఎర్ర శ్రీను, పోలే రాజు, పంతునాయక్, మీసాల అంజయ్య, నారాయణ, దేశ్యతో పాటు తదితరులు ఉన్నారు.

## శివనంపల్లి గ్రామ సర్పంచ్ గోవిందమ్మ మృతి

**ఇటిక్యాల, నవంబరు16 ప్రభాతవార్త:** మండల పరిధిలోని శివనంపల్లి గ్రామానికి చెందిన ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్ మూలింటి గోవిందమ్మ (70) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామ సర్పంచ్ గోవిందమ్మ గతకొన్ని నెలలుగా అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వచ్చారు. కర్నూల్ ఆసుపత్రి నుండి గురువారం ఉదయం గ్రామానికి చేరుకోగా గ్రామంలోనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న గద్వాల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గడ్డం కృష్ణారెడ్డి, ఎంపిడిఓ రాఘవ, పలువురు నాయకులు ఆమె మృతదేహానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. 2019వ సంవత్సరం జనవరి నెలలో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో కొత్త గ్రామ పంచాయతీగా ఏర్పడిన శివనంపల్లి గ్రామం నుండి మూలింటి గోవిందమ్మను సర్పంచ్‌గా గ్రామ ప్రజలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

## బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులు



**కొత్తకోట, నవంబర్16, ప్రభాతవార్త:** కొత్తకోట పట్టణంలోని మదీనా మస్జిద్ గ్రౌండ్లో బెల్టు గ్రేడింగ్ టెస్ట్ గాడ్స్ ఆన్ వారియర్స్ చోటు ఖాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో క్లబ్ ఫౌండర్ చీఫ్ ఎగ్జామినేర్ అబ్దుల్ నబీ సారిద్యంలో ఈ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. దీనిలో దాదాపు 20 మంది విద్యార్థి విద్యార్థులు పాల్గొని చక్కటి ప్రతిభ కనబరిచి బెల్ట్ సర్టిఫికెట్ సాధించారని సీనియర్ కరాటే మాస్టర్ ఎండి ఇంతియాజ్ తెలిపారు. ఈ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ లో ప్రతిభ చూపిన విద్యార్థులు ఎల్లో బెల్ట్ సాధించిన విద్యార్థులు, ఎస్ అమి అక్షిత లోకేష్ ఆయాన్ రెడ్డి సాదత్ అలీ షాక్ అలీ ఆరెంజ్ బెల్ట్ సాధించిన లక్ష్మీ వైశ్విక్ తేజ్, గ్రీన్ బెల్ట్ సాధించిన నవ్య, నందన్, ముషారాఫ్, మోరూన్ బెల్ట్ సాధించిన సోహెల్, బ్రౌన్ బెల్ట్ సాధించిన సాయి, దినేష్, హర్షత్ ఈ విద్యార్థులు సాధించారు. విద్యార్థులు ఫండమెంటల్ బేసిక్స్ కతస్ కిక్స్ మూమెంట్స్ కిక్స్ బ్యాలెన్స్ మరెన్నో విభాగాలలో చక్కటి ప్రతిభ కనబరిచారు. ఈ విద్యార్థులకు క్లబ్బు ఫౌండర్ అబ్దుల్ నబీ చేతుల మీదుగా బెల్ట్ సర్టిఫికెట్ అందజేశారు.

## జోగుళాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు

**ఉండవెల్లి, నవంబరు 16 ప్రభాతవార్త:** సాధారణంగా రాజకీయ నాయకుల మీద, సినిమా నటుల మీద అభిమానులు తమ ప్రేమను చాటుకోవడానికి విభిన్న మార్గాల్లో ప్రయత్నిస్తూ ఉంటారు. తాము ఆరాధించే వ్యక్తుల పేరు మీద రక్తదానం చేయడం, అన్నదానం చేయడం వంటి కార్యక్రమాలు చేపడుతుంటారు. కానీ ఇక్కడో వీరాభిమాని మాత్రం ప్రతిసారి ఓ వినూత్న కార్యక్రమం నిర్వహించి అందరి దృష్టిని ఆకర్షిస్తూ ఉంటాడు. ప్రముఖ ఫిలిం డైరెక్టర్ ఎన్.శంకర్ పెళ్లిరోజు సందర్భంగా టిఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు చింతకుంట విష్ణు దర్శకుడు ఎన్.శంకర్ ప్రతి పెళ్లి రోజుకు తన అభిమానాన్ని వినూత్నంగా చాటుకుంటూ ఉంటాడు. గతంలో శంకర్ పెళ్లిరోజు సందర్భంగా ఒక్క రూపాయికే ఒక క్వార్టర్ మద్యంను పంచిపెట్టాడు. మరొక పెళ్లిరోజుకు అలంపూర్ చౌరస్తా నుండి అడుగు అడుగునా ఒక టెంకాయ కొడుతూ మొత్తం 2006 టెంకాయలను జోగులాంబకు సమర్పించాడు. ప్రస్తుతం తన అభిమాన దర్శకుడి పెళ్లిరోజును ఎన్నికల దృష్ట్యా ఎలాంటి ఆర్భాటాలు లేకుండా దర్శకుడు ఎన్.శంకర్ పేరుతో జోగులాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తన అభిమానాన్ని చాటుకున్నారు.

## లద్దెపురుగు నివారణకు మందులు పిచికారి చేయాలి



**లింగాల, నవంబరు 16 ప్రభాతవార్త:** లద్దెపురుగు నివారణకు వ్యవసాయ శాఖ సూచనల మేరకు మందులు పిచికారి చేయాలని వ్యవసాయాధికారి నాగార్జునరెడ్డి అన్నారు. గురువారం లింగాల గ్రామ శివారులోని వేరుశనగ పంటను పరిశీలించారు. రైతులు వేరుశనగ పంటకు ఎకరాకు 200 కిలోల జిప్సం వేసినట్లయితే విత్తనం నాణ్యతతో పాటు అధిక దిగుబడి వస్తుందన్నారు. ఈ నెల చివరి వరకు విత్తనాలు విత్తుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈఓ సురెందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## విశ్వబ్రాహ్మణ నియోజకవర్గ కమిటీ ఎన్నిక

**నారాయణపేట ప్రతినిధి, నవంబరు 16 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ఉన్న శ్రీ భువనేశ్వరస్వామి దేవాలయం నూతన నియోజకవర్గ కమిటిని గురువారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా సత్యనారాయణ ఆచార కున్ని కృష్ణమాచారి, అధ్యక్షులుగా సివి నరసింహాచారి, ప్రధాన కార్యదర్శిగా రాఘవేంద్ర ఆచారి, సహాయ కార్యదర్శులుగా బుడ్డ ఆచారి, మిషిన్ రాజు ఆచారి, మందేపల్లి విశ్వనాథచారి, కోశాధికారిగా ఉజ్జల్లి బాలరాజ్ ఆచారి, కార్యవర్గ సభ్యులుగా కడుమూరి మోనేష్‌చారి, ఉట్కూర్ మోనాచారి, విజయచారి, దేవేంద్రాచారి, కమ్మరినారాయణ, జట్లేస్ శ్రీధర్‌చారి, మంతన గౌడ్ మోనేచారి, సలహాదారులుగా వడ్లగుడ్డప్ప ఆచారి, కె. సూర్యప్రకాష్ ఆచార్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరందరూ కమిటి నిబంధనలను పాటిస్తూ స్వామివారి దేవాలయ కమిటీ అభివృద్ధికిపాటుపడాలని నియోజకవర్గ స్థాయిలో ఉండే చారిస్ అందరిని ఏకగ్రీవం చేసి ఐక్యతకు పాటుపడాలని వారన్నారు.



విశ్వబ్రాహ్మణ కమిటిని ఎన్నుకున్న దృశ్యం